# జోరుగా ఇసుక దందా



చెన్నూర్‌లో పట్టుకున్న అక్రమ ఇసుక లారీ



చెన్నూర్ మండలం కత్తరశాలలో పట్టుకున్న రెండు ట్రాక్టర్లు

- యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు
- గోదావరి నది, వాగుల నుంచి తరలింపు
- ట్రాక్టర్ ఇసుక రూ.2 వేలు

**చెన్నూర్:** ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని వాగులు, గోదావరి నది నుంచి రాత్రివేళ ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. అక్రమార్కులు ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వేసవికాలం కావడంతో ఇంటి నిర్మాణాలు పెరగడంతో ఇసుకకు డిమాండ్ ఉంది. ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే సమయం పడుతుండడంతో ఇంటి నిర్మాణదారులు అక్రమార్కులను ఆశ్రయిస్తున్నారు. వారి అవసరాలను ఆసరా చేసుకుని ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.2 వేల నుంచి రూ.3 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాలో కొందరు బడా కాంట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం.

**వారంలో నాలుగు ట్రాక్టర్లు, ఒక లారీ పట్టివేత**

చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని వాగులు, గోదావరి నదుల నుంచి రాత్రిసమయంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెన్నూర్ మండలంలోని అక్కెపల్లి, సుద్దాల, కత్తరసాల వాగులతోపాటు గోదావరి నదుల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గత వారం వ్యవధిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక లారీని మైనింగ్ ఎస్ఆర్‌వో కిరణ్ ఆధ్వర్యంలో పట్టుకుని పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఓ వైపు కేసులు నమోదు అవుతున్నా.. మరోవైపు అక్రమ ఇసుక రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

**దొరికితే దొంగలు, లేదంటే రాజులే..**

కొందరు జేసీబీ యాజమానులు మాఫియాగా ఏర్పడి రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగలు ఇసుక కాంట్రాక్ట్ మాట్లాడుకుని రాత్రి తరలిస్తున్నారని తెలిసింది. అధికారులు వాగుల జాడకు రారూ అనే ధీమాతో ఈదందా సాగిస్తున్నారని సమాచారం. వారు పట్టుకుంటే దొంగలు, లేదంటే రాజులు అనేవిధంగా మారింది అక్రమార్కుల తీరు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నా అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. ఇసుక అక్రమదందా సాగించి ఒక పక్క ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండికొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చెన్నూర్, కోటపల్లి మండలాలలో యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణాను అడ్డుకట్ట వేయాల్సిన అవసరం మైనింగ్ అధికారులపై ఎంతైన ఉంది.

**ఇసుక అక్రమ రవాణా అరికడతాం**

చెన్నూర్, కోటపల్లి మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నాం. సిబ్బంది రాత్రి, పగలనక విధులు నిర్వహిస్తున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఇసుక అక్రమ రవాణా అరికడుతాం.

– జగన్‌మోహన్, ఏడీ మైనింగ్ మంచిర్యాల

## అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ నిలుపుదల చేయాలి

**నస్పూర్:** శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికుల అండర్ గ్రౌండ్ అలవెన్సు రికవరీ వెంటనే నిలుపదల చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డికి గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఎస్ఆర్‌పీ 3 గనిలో పనిచేస్తున్న 147 మంది కార్మికుల మార్చి జీతం నుంచి అండర్ గ్రౌండ్ అలవెన్సు రికవరీ చేశారని, అదేవిధంగా ఆర్‌కే 5 గనిలో విధులు నిర్వహిస్తున్న 81 మంది, ఆర్‌కే న్యూటెక్ గనిలో విధులు నిర్వహిస్తున్న 115 మంది కార్మికుల ఏప్రిల్ జీతాల నుంచి అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ చేశారని వివరించారు. 2008లో యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కార్మికుల అండర్ గ్రౌండ్ అలవెన్సుల రికవరీని వెంటనే నిలుపుదల చేయాలని, రికవరీ సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఎం పిట్ కార్యదర్శి గొల్లపల్లి రాంచందర్, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## ఏసుక్రీస్తు పునరుత్థాన జాతర

**లక్సెట్టిపేట:** మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి క్రైస్తవ భక్తులు కీర్తనలు పాడుతూ ర్యాలీ తీశారు. చర్చి సమీపంలోని శిల్వ గుట్టపై జాతరను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జాతరను సీఎస్ఐ చర్చిలో పెద్ద ఎత్తున జరుపుకుంటారు. బిషప్ పద్మారావు, చర్చిపాదర్ డేవిడ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న క్రైస్తవులు

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల శ్రీహర్ష డిగ్రీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు గురువారం హాజీపూర్ మండలంలోని మంచిర్యాల గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల నుంచి క్రికెట్‌లో రాణిస్తున్న జట్టుతో పాటు క్విజ్, చెస్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సినీ, జానపద, సాంస్కృతిక నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ పల్లె భూమేశ్, ప్రిన్సిపాల్ పోటు మనోహర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనితాఠాకూర్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

### ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ

**మంచిర్యాలటౌన్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మంచిర్యాలకు చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీని జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కే. శివ లీల, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## మనోస్థైర్యంతో ముందుకు సాగాలి

**నస్పూర్:** విద్యార్థులు మనధైర్యంతో ముందుకు సాగాలని శ్రీరాంపూర్ ఎస్సై మేకల సంతోష్ అన్నారు. ఇంటర్ ఫెయిల్ అయి పలువురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్న నేపథ్యంలో గురువారం ఆయన శ్రీరాంపూర్‌లోని పలు పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు మోటివేషన్ ప్రోగ్రాంని కండక్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పదో తరగతి ఫలితాలు వెలువడుతున్న దృష్ట్యా విద్యార్థులు చిన్న విషయాలకే క్షణికావేశంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

## వాహనాల తనిఖీ

**వేమనపల్లి:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల్లో తీసుకెళ్తున్న సామగ్రి, తదితర వివరాలు తెలుసుకున్నారు.

## మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం




ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యుడు, సిబ్బంది

**కోటపల్లి:** మలేరియా రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ సత్యనారాయణ కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలో వైద్యుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. టైర్లలో నిల్వ నీరు, వర్షపు నీటిని తొలగించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ల్యాబ్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**మలేరియాపై అవగాహన**

**మందమర్రిరూరల్:** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు ఏరియాల్లో వైద్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి రమేశ్ మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వనీటిని తొలగించాలన్నారు. సీహెచ్‌వో గంగాధర్, సిబ్బంది రేవతి, గౌతమి, కీరవాణి, స్రవంతి, మంజుశ్రీ, రాము, ఉమా, జయ, ఆశవర్కర్లు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

## ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**మందమర్రిరూరల్:** ఆటోడ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు ఆటోడ్రైవర్లు ఉన్నారు.



రాపల్లివాడకు వెళ్లేదారిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు




రాపల్లివాడకు వెళ్లేదారిలో నిలిచిన మురుగునీరు

**రోడ్లపై మురుగునీరు**

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని ఆస్నాద గ్రామంలో సరైన మురుగుకాల్వలు లేవు. రాపల్లివాడ, సర్తాపువాడలతో పాటు ఇతర కాలనీల్లో మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో తీవ్ర దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకుని మురుగుకాల్వలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## మేడే పోస్టర్ ఆవిష్కరణ

**మంచిర్యాలటౌన్:** తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘంలో భాగస్వామ్యమైన మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో 138వ మేడే వాల్‌పోస్టర్‌ను మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ఆవిష్కరించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మికుల దినోత్సవంలో మున్సిపల్ కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ.గోపాల్, కార్మికులు ఎస్.రాజం, సీహెచ్ మల్లన్న, ఏ.నర్సయ్య, ఎం.రమేశ్ పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న మున్సిపాలిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సభ్యులు

## అసంపూర్తి పాఠశాల భవనం పరిశీలన

**భీమారం:** మండలంలోని ధర్మారం పంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని ఎంపీడీవో రాధారాథోడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ విద్యాసాగర్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు రెడ్డిపల్లి పాఠశాలను అధికారులు సందర్శించారు. అక్కడ భవనం పూర్తికాలేదని, విద్యార్థులు చెట్ల కింద విద్యాబోధన జరుగుతుందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల భవనం పైకప్పు వేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతానని ఎంపీడీవో హామీ ఇచ్చారు.



పరిశీలిస్తున్న అధికారులు

### ‘గడ్డం వంశీని గెలిపించాలి’

**వేమనపల్లి:** కాంగ్రెస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని మండలానికి చెందిన ఓయూ జేఏసీ కో ఆర్డినేటర్ దుర్గం మల్లేశ్ కోరారు. బుయ్యారం గ్రామంలో ఓటర్లతో కలిసి గురువారం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రమేష్‌నేత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట:** కాంగ్రెస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరూ కలిసికట్టుగా పని చేసి వంశీ భారీ మెజార్టీ వచ్చేలా కృషిచేయాలన్నారు. మండలంలో శుక్రవారం చేపట్టిన రోడ్‌షోను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పుస్కూరి వంశీధర్‌రావు, కుమారస్వామి, రమేశ్, సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లతో కలిసి సంఘీభావం తెలుపుతున్న మల్లేశ్

### ‘కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి’

**మంచిర్యాలటౌన్:** బీఆర్ఎస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని 22వ వార్డులో గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యం, కొమురయ్య పాల్గొన్నారు.

### మల్లన్నస్వామి దొనలో గుప్త నిధుల తవ్వకాలు

**జైపూర్:** వేలాల శ్రీ గట్టు మల్లన్నస్వామి దొనలో గుప్తనిధుల కోసం రెండురోజుల కిందట తవ్వకాలు జరుపగా విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. శివలింగం కింద, దాన్ని పక్కల తవ్వకాలు జరిపినట్లు స్థానికులు తెలిపారు. ఆలయ సంబంధీకులే తవ్వకాలు జరిపి అనుమానం రాకుండా మళ్లీ యథాస్థితికి సిమెంట్‌తో తెచ్చినట్లు ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయం వారికి తెలియడంతో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

### మున్సిపల్ కాంట్రాక్టు సంఘం నూతన కార్యవర్గం

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గోగర్ల ఆశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బూడిద శ్యాం కుమార్, కార్యదర్శిగా ఆత్మకూరు తిరుపతి, ఉపాధ్యక్షులుగా ఉప్పులేటి రామస్వామి, ఆవుల శ్రీనివాస్, పల్లపు రాజేశ్వరి, వాసాల కుమారస్వామి, ఆవునూరి లింగయ్య, చిప్పకుర్తి రాకేశ్, బూడిత తిరుపతి, ఓటుగంటి దుర్గమ్మ, ఆవునూరి సుధాకర్ ఎన్నికయ్యారు.

### అంగన్‌వాడీ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీ పరిధి అశోక్‌నగర్ బస్తీలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎల్.జ్యోతి ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు అంగన్‌వాడీ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, భారతి పాల్గొన్నారు.

### పేద యువతి వివాహానికి ఆర్థికసాయం

**దండేపల్లి:** మండలంలోని తాళ్లపేటకు చెందిన యూసుఫ్ కూతురు వివాహానికి కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీశ్, ఎంపీటీసీ హేమలత రూ.8 వేల ఆర్థికసాయాన్ని గురువారం అందించారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఈసాయాన్ని అందించినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు కాంతారావు, సాదిక్, సల్లూ, సోహైల్, నర్సయ్య, లచ్చన్న, సమ్దాని, నజీర్, దేవయ్య, భక్తవర్‌ఖాన్, యూసుఫ్ ఖాన్, జాఫర్‌ఖాన్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తాగునీటి సమస్య లేకుండా చర్యలు



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎంపీవో

**వేమనపల్లి:** మండలంలోని పంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీవో బాపురావు పేర్కొన్నారు. మండలంలోని కేతన్‌పల్లి పంచాయతీ పరిధిలో శానిటేషన్ పనులను గురువారం పరిశీలించారు. గ్రామాల్లో మోటారు, చేతిపంపు మరమ్మతు ఏమైన ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. వాటర్‌ట్యాంకులను శుభ్రపర్చాలని అన్నారు. అనంతరం 199, 200 పోలింగ్ బూత్‌లను పరిశీలించి వసతులపై ఆరా తీశారు.

### ఆయిల్‌పాం, పండ్ల తోటలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

**జైపూర్:** మండలంలోని షెట్‌పల్లిలో రైతులకు ఆయిల్‌పాం, పండ్ల తోటలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకులను ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారులు వివరించారు. జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటి వసతి ఉన్నవారు ఆయిల్‌పాం సాగు చేయాలన్నారు. ఉద్యాన అధికారి తిరుపతి, మ్యాట్రిక్స్ అధికారి జగదీశ్, శంకర్, రైతులు పాల్గొన్నారు.

### ఓటరు స్లిప్‌లు అందేలా చూడాలి



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

**జన్నారం:** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రతీ ఓటరుకు ఓటర్ స్లిప్ అందేలా చూడాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి ఓటర్ స్లిప్‌లు అందజేశారు. మండలంలో 54 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బీఎల్‌వోలకు ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేయాలన్నారు. మే 4 వరకు అందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో డీటీ రామ్మోహన్, ఆర్ఐ భానుచందర్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### ఉపాధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్

**మందమర్రిరూరల్:** ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై గురువారం వారంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో రాజేశ్వర్ హాజరై పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో రజియాసుల్తానా, పంచాయతీల కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మొబైల్ హోల్‌సేల్ వ్యాపారులతో నష్టం

**మంచిర్యాలటౌన్:** పట్టణంలోని మొబైల్ యూనియన్ ఆధ్వర్యంలో హోల్‌సేల్ వ్యాపారులతో కలిగే నష్టంపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జాకీర్ మాట్లాడుతూ పట్టణంలో 200లకు పైగా మొబైల్ షాపులు ఉండగా, తమ జీవన ఆధారం రిపేరింగ్ పైనే ఉంటుందని అన్నారు. కానీ హోల్‌సేల్ షాపులు 9 ఉండగా, వారే డిస్ట్రిబ్యూటర్లుగా, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారంతోపాటు, రిపేర్ కూడా చేయడం వల్ల తమ షాపులు నడవడం లేదన్నారు. ఈ విషయమై అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు కేవలం హోల్‌సేల్ మాత్రమే చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.